ఆహార సలహా కమిటీలు ఎక్కడ?

- సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం
- తూకాల్లో అవకతవకలు
- డీలర్ల నిర్వాకంతో నష్టపోతున్న పేదలు
- పట్టించుకోని అధికారులు

▸▸ ఈ నెల 8న తాడిపత్రి మండలంలోని సజ్జల దిన్నె క్రాస్ వద్ద శుక్రవారం విజిలెన్స్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 147 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది.

▸▸ ఈ నెల 10న యాడికిలోని ఓ రైస్ మిల్లులో దాదాపు 337.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం బస్తాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా నిత్యం ఏదో ఒక చోట రేషన్ బియ్యం పట్టుబడుతున్నాయి. ఆహార సలహా కమిటీలు లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.


యాడికి రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)

రెవెన్యూ డివిజన్‌లో ఇలా..	
మండలం	రేషన్ కార్డులు
తాడిపత్రి (పట్టణం సహా)	45,615
పెద్దపప్పూరు	10,765
యాడికి	16,247
పెద్దవడుగూరు	14,380
పుట్లూరు	11,472
యల్లనూరు	11,059

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వం కొలువైన తరువాత తాడిపత్రి నియోజకవర్గంలో ఆహార సలహా కమిటీల ఊసే లేదు. ఆహార సలహా కమిటీలను ఏర్పాటు చేస్తామన్న ఆలోచన అధికార యంత్రాంగానికి కనిపించడం లేదు. కమిటీలను నియమిస్తే రేషన్ బియ్యం అక్రమార్కుల నుంచి వచ్చే ఒత్తిడులను తట్టుకునే కంటే.. వాటి జోలికి వెళ్లకపోవడం మంచిదన్న ఆలోచనలో అధికారులు ఉన్నారా? అన్న సందేహాలు కలుగుతున్నాయి. పాత కమిటీలతో కూడా సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం బట్టి చూస్తే అనుమానాలు నిజమవుతున్నాయి. రేషన్ దుకాణాల్లో అక్రమాలను అరికట్టడం, సజావుగా రేషన్ పంపిణీ జరిగేటట్టు చూడటం కోసం గతంలో ఈ కమిటీలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసేది. ఈ కమిటీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమై రేషన్ పంపిణీ వ్యవస్థపై సమీక్ష జరిపేవి. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు వీలుండేది. ఈ కమిటీల్లో చైర్మన్‌గా ఆర్డీఓ లేక సబ్ కలెక్టర్, వైస్ చైర్మన్లుగా మునిసిపాలిటీలో చైర్మన్, మండలాల్లో ఎంపీపీలు, కన్వీనర్లుగా ఆయా మండలాల్లో తహసీల్దార్లు, సభ్యులుగా ఎంపీడీఓలు, జెడ్పీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, డీలర్ల సంఘం నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు ఉండేవారు.

అక్రమాలపై కొరవడిన నిఘా..

ఆహార సలహా కమిటీల ప్రధాన ఉద్దేశం రేషన్ దుకాణాలను తనిఖీ చేయడం, రేషన్ సరఫరాలో జాప్యం, తునికలు, కొలతలపై నిఘా పెట్టడం. ప్రస్తుతం తాడిపత్రి ప్రాంతంలో స్టాక్ పాయింట్‌కు, డీలర్లకు మధ్య సమన్వయం కనిపించడం లేదు. స్టాక్ పాయింట్ నుంచి తక్కువ తుకాలతో బస్తాలు వస్తున్నాయంటూ కొందరు డీలర్లు కార్డుకు రెండు కిలోల బియ్యం చొప్పున తక్కువ వేస్తున్నారు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు సరిదిద్దడం లేదు. వీరి వైఖరి వల్ల లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలని అధికారుల ఆదేశాలున్నా డీలర్లు పట్టించుకోవడం లేదు. తమ కోటా పూర్తి అయిందన్న నేపంతో డీలర్లు దుకాణాలను 5వ తేదీలోపే మూసివేస్తున్నారు.దీని వల్ల ఆలస్యంగా వచ్చే రేషన్ కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పెద్ద ఎత్తున రేషన్ బియ్యం జిల్లా సరిహద్దులు దాటుతోంది. ఇటీవల రోజుల వ్యవధిలో రెండు సార్లు రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. రేషన్ బియ్యం అక్రమార్గంలో వెళ్లకుండా డీలర్లపై దృష్టి పెట్టాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

కమిటీలను ఏర్పాటు చేయాలి



రేషన్ రవాణా, పంపిణీల్లో జరుగుతున్న అక్రమాలు, జాప్యంపై చర్యలు తీసుకునేందుకు అహార సలహా కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలి. కమిటీలు లేకపోవడం వల్ల కార్డు దారులకు న్యాయం జరగడం లేదు.

– జగన్, సీఐటీయూ నాయకుడు

రేషన్ సమస్యలు పరిష్కరిస్తాం



కొత్తగా అహార సలహా కమిటీలను ఏర్పాటు చేయలేదు. సంబంధిత అధికార యంత్రాంగం కమిటీలను ఏర్పాటు చేసినట్టు సమాచారం లేదు. కమిటీలు లేకున్నా రేషన్ పంపిణీలో జాప్యం, ఇబ్బందులను ప్రజలు నా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

–సోమశేఖర్, తహసీల్దార్

క్లుప్తంగా

కంటి వైద్య శిబిరానికి స్పందన


వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి ఎన్.తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో బెంగుళూరు ప్రముఖ శంకర ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు రాలు మస్నీ 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 48 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కే రఘువీర్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, కోశాధికారి డీ షెక్షావలి, జిల్లా చైర్‌పర్సన్లు డాక్టర్ శాంతి ప్రియ, డాక్టర్ మురళీకృష్ణ, పీసే జయరాం రావు, సహకార్యదర్శి ఎం.షెక్షావలి, ఆర్గనైజింగ్ సెక్రెటరి పత్రా నరేష్‌కుమార్, బెంగుళూరు శంకర ఆసుపత్రి ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకేష్, శంకర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడికి కిలో వెండి వితరణ


వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: పట్టణానికి చెందిన సోదరులు వి.శ్రీనివాస్ బాబు, వి.గణేష్ బాబు, వి.వాసు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామికి కిలో వెండిని విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా అర్చకులు దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పోగొట్టుకున్న పర్స్ అందజేత


జవాన్ గణేష్‌కు పర్స్ అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ ప్రయాణికుడు (బీఎస్‌ఎఫ్ జవాన్) పోగుట్టుకున్న పర్స్‌ను అందజేసి సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే..ఆర్టీసీ బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బాబాముస్వర్‌కు ఓ పర్స్ దొరికింది. పర్స్‌లో చెక్ చేయగా రూ.6 వేల నగదుతోపాటు ఐడీ కార్డు ఉంది. ఐడీ కార్డు ద్వారా కర్నూలు జిల్లా చిప్పగిరికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ కేఎస్ గణేష్‌గా గుర్తించారు. చిప్పగిరిలోని హెడ్ కానిస్టేబుల్ స్నేహితుల ద్వారా గణేష్ సెల్ నంబర్ సేకరించి గుంతకల్లుకు రప్పించి పర్స్ అందజేశారు. బీఎస్‌ఎఫ్ జవాన్ తన కుటుంబసభ్యులుతో కలిసి గుత్తికి వెళ్లడానికి గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన సమయంలో పర్స్‌ను మిస్ చేసుకున్నట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్‌కు జవాన్ కృతజ్ఞతలు తెలిపారు.

టెన్త్ టాపర్‌కు నగదు పురస్కారం


ఆర్షియాకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే హైస్కూల్‌కు చెందిన ఓ విద్యార్థికి పూర్వ విద్యార్థులు నగదు పురస్కారం అందజేసి అదర్శంగా నిలిచారు. హైస్కూల్‌కు చెందిన ఆర్షియా ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 554 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఆర్షియా ఉన్నత విద్యా అభ్యసించడానికి పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న రైల్వేహైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు (10వ తరగతి బ్యాచ్, 1971) పోగుచేసిన రూ.50,101ను.. ఆదివారం సాయంత్రం రైల్వే హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్ చేతుల మీదుల మీదుగా ఆర్షియాకు అందజేశారు. విద్యార్థిని చదువుల్లో మరింత రాణించి తల్లిదండ్రులకు, గురువులకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి హఫీజ్ బండ నవాజ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మట్కా రాస్తున్న రంగయ్య అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. గత కొద్ది రోజులుగా మట్కా నిర్వహిస్తున్నట్లుగా సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. గ్రామంలో ఒక చోట కూర్చొని మట్కా నంబర్లు రాస్తుండగా అదుపుతోకి తీసుకుని, అతడి నుంచి రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యాకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు

గుత్తి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు సూచించారు. పట్టణంలోని అనంతపురం రోడ్డులో లార్డ్ జీసస్ చర్చిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్, మైనార్టీ సెల్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. పదవులను బాధ్యతగా భావించి ముందుకెళ్లాన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమించాలన్నారు. మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. పది రోజులకు ఒకసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు. గుంతకల్లు రోడ్డు, అర్‌ఎస్ రోడ్డు, చర్చి రోడ్డు దారుణంగా మారాయన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే నెలలోనే రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే.. అధికారంలోకి వచ్చి 14 నెలలైనా ఎందుకు రోడ్లు నిర్మించలేదని ప్రశ్నించారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బింగి కిరణ్ బాబు, మండల అధ్యక్షులు బాలయ్య బర్నబాస్, మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగేంద్ర బాబు, కార్యదర్శి ప్రియాంక, సభ్యులు అబ్రహాం, రామారావు, అశోక్, భార్గవ్, స్టాలిన్, సుమిత్ బాబు, గ్లాడ్ స్టోన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గేయానంద్

గుత్తి: ప్రతి ఒక్కరూ మూఢ నమ్మకాలు వీడి, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సూచించారు. గుత్తిలోని పద్మ వాణి పాఠశాలలో ఆదివారం జేవీవీ 18వ జిల్లా మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో గేయానంద్ మాట్లాడారు. మూఢ నమ్మకాలు సమాజ ప్రగతికి ఆటంకాలుగా మారతాయన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత , విద్యార్థులు సైన్స్, జేవీవీ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు శ్రీధర్ గౌడ్, ఆఫీస్, దేశాయి నాగరాజు, సీతానంద, రంగనాథ్, జిలాన్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


గుంతకల్లు శివారులో పక్కకు ఒరిగిన లారీ


గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద ఢీకొన్న లారీ, కారు

గుంతకల్లు: పట్టణ శివారులోని పారిశ్రామికవాడలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి లారీ పక్కకు ఒరిగి పడింది. వివరాల్లో వెళ్తే.. తాడిపత్రి నియోజకవర్గంలోని రాయలచెరువు నుంచి కర్ణాటక రాష్ట్రం బెల్గాం జిల్లా యాద్వాడ్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీకి కంకర లోడ్‌తో లారీ బయలుదేరింది. పట్టణ శివారులోని పారిశ్రామిక వాడ సమీపంలోని నిర్మాణంలో ఉన్న ఇస్కాన్ టెంపుల్ వద్దకు లారీ రాగానే ఆర్టీసీ బస్సు వేగంగా ఎదురు రావడంతో లారీ డ్రైవర్ గుఫ్రాన్ వెంటనే అప్రమత్తమై సైడ్‌కు తిప్పడంతో.. ఎడుమ వైపుకు లారీ ఒరిగి పోయింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అటు ప్రయాణికులు, ఇటు లారీ డ్రైవర్, క్లీనర్లు ఊపిరి పీల్చుకున్నారు. మరో లారీ సహాయంతో పక్కకు ఒరిగిన లారీని బయటకు లాగి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం లారీ, కారు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం వైపు నుంచి ఓ లారీ గుత్తి వైపు వెళ్తుండగా కల్లూరు –తరిమెల క్రాస్ స్పీడ్ బ్రేకర్ల వద్ద కారు ఢీకొంది. కారులో ఉన్న ఎవరికీ గాయాలు కాలేదు. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జైందని పోలీసులు తెలిపారు.

• పొంచి ఉన్న ప్రమాదం

గుంతకల్లు: స్థానిక 60 అడుగుల రోడ్డులోని కృష్ణదేవరాయల విగ్రహం వద్ద కాలువపై ఉన్న కల్వర్ట్ దెబ్బతింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణదేవరాయల విగ్రహం వద్ద నుంచి సాయినగర్‌కు వెళ్లే మార్గంలో కల్వర్ట్ మధ్యలో దిమ్మె జారి కాలువలోకి పడింది. ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో రాత్రిపూట వాహనదారులు, పాదచారులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదంలో పడతారు. మున్సిపల్ అధికారులు స్పందించి దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


గుంతకల్లులోని 60 అడుగుల రోడ్డులో సాయినగర్‌కు వెళ్లే మార్గంలో దెబ్బతిన్న కల్వర్టు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


అయ్యవారుపల్లిలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని అయ్యవారుపల్లిలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామి ప్రతిమను కొలువుదీర్చి పూజలు చేశారు. ఆదివారం ప్రత్యేక పూజల నిర్వహణ అనంతరం స్వామివారిని పల్లకీపై కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


నరసాపురంలో శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా బాలక్రిష్ణుడి ఊరేగింపు

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురంలో క్రిష్ణాష్టమి సందర్భంగా ఆదివారం బాలక్రిష్ణుడి ఉత్సవమూర్తిని త్రైత సిద్ధాత ప్రభోద సేవా సమితి భక్తులు గ్రామంలో ఘనంగా ఊరేగించారు.అనంతరం భక్తులకు అటుకుల ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు.

రైల్వే గేటు పడితే.. తలపోటే!


రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాలు

గుంతకల్లుటౌన్: పట్టణ నడిబొడ్డున ధర్మవరం రైల్వే గేట్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి. రైల్వే గేటు దాటే వరకూ పద్మవ్యూహాన్ని తలపిస్తుంటుంది. గేటు వేసిన సమయంలో రోడ్డు కిరువైపులా వందలాది సంఖ్యలో వాహనాలు నిలిచిపోతాయి. గేటు తీసిన తరువాత వాహనాలు అడ్డదిడ్డంగా వెళ్తుండటంతో.. వాహనాలు పరస్పరం ఢీకొంటూ తరుచూ గొడవలు అవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కూడా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రైలుమార్గం ద్వారా రోజూ 30కి తగ్గకుండా ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగుతుంటాయి. అంబులెన్స్‌లు వచ్చినా, మృతదేహాల్ని శ్మశాన వాటికకు తీసుకొచ్చినా 15 నుంచి 20 నిమిషాల పాటు వేచి ఉండాల్సిన దుస్థితి దాపురించింది. రైల్ అండర్‌పాస్ బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పటి వరకూ రైల్వేగేట్ వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

'సేవ్ ఆర్డీటీ' విజయవంతం చేయండి

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే సేవ్ ఆర్డీటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ నాయకుడు కత్తుల కొండయ్య కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలన్నారు. పేదల అభ్యున్నతికి కృషి చేసిన సంస్థను కాపాడుకోవడం కోసం చేపట్టిన కార్యక్రమంలో మండలంలోని ప్రతి ఆర్డీటీ లబ్ధిదారుడూ పాల్గొనాలని సూచించారు.

కోటంకలో 'శ్రావణ' పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శ్రావణ మాసం నాలుగో ఆదివారం సందర్భంగా ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

• అ'పూర్వ' సమ్మేళనం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో 2004–07లో బీఎస్సీ చదువుకున్న విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. రోజంతా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అప్పటి గురువులైన విశ్వనాథ్, నరసింహులు, సూర్యభగవాన్, భానుప్రకాష్, మురళీరాజు, చక్రవర్తిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రతాప్‌రెడ్డి, వెంకట్, జయశేఖర్‌రెడ్డి, నాగరంగప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రుష్యశృంగ కొండపై భాగవత పారాయణం

శింగనమల: శింగనమల సమీపంలోని రుష్యశృంగ మహాముని కొండపై ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ భాగవత పురాణ పారాయణం నిర్వహిస్తున్నట్లు రేగడి కొత్తూరు గ్రామస్తులు తెలిపారు. అలాగే రోజూ భజన కార్యక్రమాలుంటాయన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

'ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దారు రాము సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కొన్ని శాఖల అధికారులు హాజరు పట్టికలో సంతకాలు చేసి... బయట తిరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. కాగా యల్లనూరు, తిమ్మంపల్లి పీహెచ్‌సీ, ఇరిగేషన్, హార్టికల్చర్, పశువైద్యం, హాస్టల్ వార్డన్ తదితర శాఖల అధికారులు తరచూ హాజరుకావడం లేదు. వారిని ఫిర్యాదుల విభాగానికి పిలిపించుకోవాలని ప్రజలు కోరారు.

నిండుకుండలా గుత్తి చెరువు



గుత్తి: గుత్తి చెరువు నీటితో నిండు కుండలా కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి 80 శాతం వరకూ నీరు చేరింది. కేవలం అడుగున్నర నీళ్లు వస్తే చెరువు పూర్తిస్థాయిలో నిండుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత చెరువు నిండడంతో ఆయకట్టు రైతులు, మత్స్య కారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

యల్లనూరు: వినాయకచవితి పండుగలో భాగంగా గణపతి విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆదివారం ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ సత్యబాబు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇరువర్గాల ఘర్షణ

• ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం రస్తా, కొళాయి విషయాలపై ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో సోదరులు రాజు, రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. రస్తా, కొళాయి విషయంలో గత కొన్ని రోజులుగా రాజు– పవన్ వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో ఆదివారం ఇరువర్గాలు ఘర్షణకు దిగి కొట్టుకున్నారు. గాయపడిన రాజు, రామాంజనేయులును ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

పామిడి: అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ యాడికి మండలం పుప్పాల తండా గ్రామవాసి, రైతు నారాయణస్వామినాయక్(44) మృతి చెందినట్లు ఆదివారం పామిడి పోలీసులు తెలిపారు. నారాయణస్వామి నాయక్ రెండు ఎకరాల పొలంతో పాటు అన్నదమ్ముల ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, ఇతర పంటలను సాగుచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఇటీవల తన రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాడు. ఇందుకు గాను పొలంలో బోర్లు వేయించినా నీరు లభ్యం కాలేదు. పంటలు పండకపోగా, కుటుంబం కోసం రూ.8 లక్షలు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో? అంటూ మానసిక వేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో ఈ నెల 8న పురుగుల మందు తీసుకొస్తానంటూ కుటుంబ సభ్యులకు చెప్పి పామిడికి వచ్చాడు. స్థానిక ఎద్దులపల్లిరోడ్డులో మద్యం సేవించి అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు అనంతపురం సర్వజనాసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణస్వామినాయక్ శనివారం రాత్రి మృతి చెందడు. అతడికి భార్య జయలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీ యుగంధర్ తెలిపారు.